ఘటన

శ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

"అయ్యా, కొండుభట్టు పంతులుగారు! కన్యావరణల సమయం శెలవిప్పించండి" అనడిగాడు మొగపెళ్లివారి పురోహితుడు.

"అది మా మామగారితో మనవిచెయ్యండి మీరు" అని మాత్రం అని వూరుకున్నాడు, పెళ్లికొడుకు తండ్రి, కొండుభట్టు.

"వీరప్పయాజులుగారితో మనవి చేసుకుంటున్నా" నన్నాడు, పురోహితుడు.

ఆజానుబాహువు మనిషి యాజులు.

పంచె కట్టాడు; కాని లాంగ్‌కోటు తొడిగి, పాగా చుట్టుకుని వున్నాడు అతను.

జానేడేసి పొడుగున్నాయి మీసాలు, వెండి తీగల్లా. సహజంగా లౌక్యు డతను, చదువుసంధ్యలు తక్కువయినా, వేషానికి మాత్రం లౌక్యుల్లాగే వుంటాడు, సప్రయత్నంగా.

ప్రతిభావంతు డని పేరూ వుం దతనికి, దానికి మాటున రాక్షసు డన్న బిరుదూ వుంది.

"జరిగించెయ్యండి" అన్నా డతను, చెయ్యూపుతూ.

పురోహితుడు సభాపతికేసి చూశాడు.

"గ్రామత్వేనా పదిరూపాయ లిప్పించండి" అన్నాడు సభాపతి.

పురోహితుడు తనకేసి తిరక్కముందే "పెద్దలకు అణాచొప్పున ఇప్పించండి" అన్నాడు యాజులు.

ఇది విని, సభాపతి, కళ్లు మూసుకుని తలఅడ్డంగా వూపుకున్నాడు.

"సభాపతిగా రంగీకరించడం లేదు యాజులుబాబుగారూ!"

"ఏమో?"

"కన్యావరణలూ, సభాకట్నాలూ వూరుమ్మడి మీద పుచ్చుకోడం వుంటుంది, కొన్ని వూళ్ళలో."

"అయితే?"

"ఎంతో కొంత మొత్తం సభాపతిగారి కందించాలి, ముందు మనం."

"తరవాత?"

"గౌరీపూజామంటపం దగ్గిరికి, వెళ్లి ప్రవరపూర్వకంగా వరుడిపేరు చెప్పి పిల్ల నడగడానికి, ముగ్గురినో, అయిదుగురినో, మరికొందరినో, ప్రత్యేక ప్రత్యేకంగా కన్యావరణ లిచ్చి పెద్దలను కూడా పంపాలి, మనం."

"అదెంతేసి?"

"వరహా లివ్వవచ్చు, రూపాయ లివ్వవచ్చు, అర్ధలు - పావులాలు - బేడలు - అణాలు - అర్ధణాలు కానులు చివరికిప్పటి మానం ప్రకారం కొత్తపైసలున్నా యివ్వవచ్చు" అని బదులు చెప్పాడు సభాపతి పురోహితుడికేసి చూస్తూ.

యాజులు మొగం చిట్లించుకున్నాడు.

ఈ మర్యాదలు తెలియనివి కావతనికి.

కాని, సభాపతి సూటిగా తన్నడక్కపోడం.

తనకేసి చూడకపోడం, తరవాతనైనా.

పోనీ అంటే, కొత్తపైసల మాటయెత్తడం.

ఆయన తనని లోభికింద కట్టాడనుకున్నాడు.

అది పరాభవంగా భావించుకున్నాడు.

అభిమానం తెచ్చుకున్నాడు.

ఆగ్రహం కూడా? పెంచుకున్నాడు, చివరికి.

దీంతో "రెండువిధాలా యివ్వలే మని చెప్పండి" అన్నాడు, తానున్నా పురోహితుడి కేసే చూస్తూ, యాజులు.

"ఇవ్వం అనే చెప్పండి" అని కూడా అన్నా డతను, కొంచెం దురుసుగా.

సభాపతి మాట్టాడలేదు.

సాలోచనగా పక్కకి చూశాడతను, కొంచెం కిందుగా.

అలా వుండే కళ్ళుమూసుకున్నా డొక్కమాటు.

చివరికి, తన దొదలే వున్న వృద్ధపండితుడి కేసి పులుకూ పులుకూ చూసి వూరుకున్నాడు.

"తరతరాలుగా వస్తున్న ఆచారం యిది మావూళ్లో. ఇవాళ హఠాత్తుగా మారవలసిన అగత్యమూ లేదు. మారనూ మారదు" అన్నా డా వృద్ధపండితుడు సభాపతికేసి చూస్తూ.

ఘటన

"మావూరి మర్యాదలు వేరు. మేము పాటించుకోవలసిన వవి."

వీరప్పయాజులిలా అన్నాడు, కాని అతను మాట ముగించక పూర్వమే "కాదు కా" దన్నాడు, మరో పెద్దమనిషి.

"ఏమి కాదు?"

"మా గ్రామంలో — అంటే పెళ్ళికొడుకు స్వగ్రామంలో కూడా రెండు విధాలా యివ్వడమే ఆచారం."

"కావచ్చు. వ్యవహారం నడుపుతున్నవాణ్ణి నేను. ఈవూరి మర్యాదలతో నాకు ప్రసక్తి లేదు."

మరెవరూ మాట్లాడలేదు.

వ్యవహారం నిలిచిపోయింది.

గడియారమే ఆగిపోయినట్టయింది.

పులుకూ పులుకూ చూశాడు పెళ్ళికొడుకు, తండ్రికేసి.

"అబ్బాయి—" అన్నాడు కొండుభట్టు పురోహితుడితో.

"పెళ్ళికొడుకే కాదు, నేనూ తొందరపడుతున్నాను, కాని వ్యవహారం నావశం తప్పింది. దిగ్దంతులవంటి పండితులు కూచుని వున్నారు సభలో. లోకంలో నేను తలెత్తుకుని తిరగాలంటే నా బాధ్యత కూడా వుందిక్కడ. సభాపతిగారూ మీమామగారూ కూడా అనుజ్ఞ దయచేయిస్తేనే, ముందు కడుగు వెయ్యడం నేను" అని స్పష్టంగా చెప్పాడు పురోహితుడు.

"మాకు తోచింది మేమిస్తాం" అన్నాడు యాజులు, బెట్టుగా.

"తమ కొమార్తె పాణిగ్రహణం సందర్భంలో ఆశీర్వచనం చేసి, వెళ్ళవలసిందన్న కన్యాదాత పిలుపు మీద వచ్చాం మేము. మావిధి మేము మరిచిపోలేదు. తప్పము కూడా. అయి , ఈవూరి మర్యాదలతో తమకు ప్రసక్తి లేదన్నవారి వూరి మర్యాదలతో మాకూ లేదు, ప్రసక్తి."

సభాపతి యింగితం గుర్తించి వూరి వృద్ధపండితుడిలా అనగా, అందరి చూపులూ యాజులుమీద పడ్డాయి, గోదావరిజల్లులాగ.

ఆలోచించాడు యాజులు.

విషయం తప్పించాలనుకున్నాడు.

"సుముహూర్తం దగ్గిరపడుతోంది, కానివ్వా" లన్నాడతను, కొంచెం గట్టిగా.

"నా అభ్యంతరం యేమీ లేదు. గడిచిపోయిన కాలం నేను కూడతీసుకోగలను. కనక, యింకో మాటు చెబుతున్నాను. ఊరివారి అనుజ్ఞ లేకుండా తంతు నడిపించుకోనిపోడం అతి సాహసం అవుతుంది" అని మళ్ళీ చెప్పాడు, పురోహితుడు.

"మరి తంతుమాట? సుముహూర్తం—దాటిపోతే దాని కెవరూ బాధ్యులు?"

అందరూ వులిక్కిపడ్డారిది విని.

చూడగా, అయిమూలమొగం పెట్టుకుని నిలవతీస్తున్నట్టు చూస్తున్నాడు కొండుభట్టు.

అసల్లో రెవెన్యూ తహసీల్దారతను.

తాను పనిచేసిన తాలూకాల్లో చండశాసనుడనే పేరుందతనికి.

కాని యిది అతను పనిచేసిన వూరు కాదు.

ఇది సభ కాని తాలూకా కచేరీభవనమూ కాదు.

తన మట్టుకయినా తహసీల్దారూ కాదతనిప్పుడు.

నిజానికిది అతనికొడుకు పెళ్ళే.

అయితే, మొగపెళ్ళివారిలో భోజనాలకు పిలుపువస్తే యెవరిమట్టుకి వారే ముడికట్టుకుంటారు, తక్కినవారు.

అతను మాత్రం యాజులు కూడా పిలిస్తేనే సిద్ధపడ్డం.

ఏమయినా, అతని చేవ్రాలుతో వున్న ఆహ్వానపత్రిక. అందుకునే వచ్చారు, చాలామంది పెద్ద మనుష్యులు.

వారిలో కొందరతనిలాగే "రిటైర్డు" బాపతువారయినా, ఇప్పుడు పనిచేస్తున్నవారూ వున్నారు, చాలామంది.

కొన్ని తాలూకాకచేరీల గుమాస్తాలూ వున్నారు.

మరి, తాను కూడా వారిలాగే శ్రోతా ద్రష్టా అయిమాత్రమే కూచోడమా?

ఇదిగో, యీ తపనతో తన పెత్తనం యిలా చూపించుకున్నాడతను.

"ఒక్క సంగతి మనవిచేసుకుంటా" నంటూ అందుకున్నాడు, పొరుగూరు ప్రౌఢవిద్వాంసుడొకడు—ఇది తెలియక.

"లోకాన్నిపట్టిలాగే వైదికాన్ని పట్టినీ వొక్కొక్క వూరి కొక్కొక్క పద్ధతి యేర్పడి వుంటుంది—"

"అయితే, యేమిటండీ?" అంటూ గద్దించాడు యాజులు.

"ఏమిటో వినతలుచుకున్నారా మీరు?" అని ముదలకించాడు పండితుడు.

"చెప్పండి చూతాం."

"అయితే, నేను చెప్పేదంతా వినండి ముందు."

"చెప్పమన్నాగా?"

"ఈవూరు వచ్చారు మీరు. ఇక్కడివారికే మీరు కన్యావరణ లివ్వడం. కనక, సభాపతిగారి మాట విశ్వసించడమూ అంగీకరించడమూ మీకు ధర్మం."

"ధర్మం అంటే యెక్కడికి? మే మివ్వడానికి సిద్ధంగా లే మనా మీ వూహ, పోనీ?"

"మరి, సాహసించకపోడాని క్కారణం?"

పక్కకి చూస్తూ వూరుకున్నాడు యాజులు.

"ఇంకొకటి కూడా వుంది" అంటూ అందుకున్నాడు వూరి యువకుడు.

"పదు లడిగితే పాతికలూ, పాతిక లడిగితే నూట పదార్లూ ఇచ్చినవారు కూడా వున్నారు, ఈవూరి విద్యాంసులు."

కళ్లు మూసుకుని, సభాపతి, తలతాటించుకున్నా డామాటకి "అవు" నన్నట్టు.

"అడిగిందే యివ్వనివారు లేరంటూరా?" అనడిగాడు యాజులు, అవ్యవధానంగా అందుకుని.

"ఉండరూ? ముఖేముఖే సరస్వతీ కదా?"

"సరస్వతి మాటకి తల వూపవలసిందేగా అందరూ?"

గభీమని లేచా డొక యువకుడు.

మంచి వర్చస్వి అతను.

మెరుపు దీపాల వెలుగులో కళ్ళు జిగాల్ జిగా ల్మనిపించేస్తోంది అతను కప్పుకుని వున్న వూదారంగు జరీ కాశ్మీరుశాలువు.

మొదట చాలా చురుగ్గా చూశా డతను.

సభ అంతా సావధానం అయినట్టు తోచగానే వొక్కటే మాట అన్నా డతను, అతిఖండితంగా "మీ రడిగినంతా ముందే పుచ్చుకుని వచ్చారు మీ రీవూరు, కనక, మే మడిగినంతా కూడా మాకిచ్చి మావూరి పిల్లను చేసుకుని వెళ్లండి మీవూరు" అని.

సభ అంతా చకితం అయిం దామాట విని.

గుసగుసలు రేగాయి, అంతటా.

బహుముఖాల తాండవం ప్రారంభించింది, చివరికి సరస్వతి.

రెండే మాటలు వినపడ్డా యా కోలాహలంలో అందరికీ "ఇవ్వం" అని వొకటీ "అలా యిస్తేనే గాని పుచ్చుకోం" అని వొకటీని.

2

"అదేమే, పిల్ల మొగాన సంబరమే కనబడ దేమే?" అనడిగిం దొక ముత్తయిదువు, అపవారించి పెళ్ళికూతురి తల్లి ని.

"వయసు వచ్చిన పిల్లగదా, పెళ్ళిలో సిగ్గుపడదూ పిన్నీ, నా బిడ్డ?"

"ఏమో, నవ్వూ మందకొడిగానే కనపడుతున్నావే."

"నెత్తిమీద యింత బరువెత్తుకున్నాను గదా–"

"లక్షలు పోగుపెట్టి కూర్చున్నాడు నీ మొగుడు, బరు వేమిటే నీకు?"

"లక్ష లుంటే తీరేవి టమ్మా యివి, మొగ పెళ్ళివారిలో పిల్లా మేకా కాక, పేరంటాళ్లే యాభైమంది వున్నారు. తగిన మర్యాదలుచేసి వారిని సాగనంపడం యెలాగో, ఆందోళన కొదుటమ్మా నాకు?"

గౌరీపూజ ముగిసింది.

సభక్తికంగా నాందీ దేవతారాధన పూర్తిచేసుకుని, పీటలమీదినుంచి లేచివెళ్ళి యెందుకో యెవంతోనో మంతనాలు సాగిస్తున్నాడు కన్యాదాత.

"పెసరట్లు లేకపోతే తెల్లవారడమే గాని పొద్దు గడవదుట వియ్యపురాలికి, కొంపతీసి మరిచిపోలేదు గదా తమ్ముడూ?" అనడుగుతూ కొట్టు పెత్తనదారు కోసం వంటపందిటిలోకి బయలుదేరింది పెళ్ళికూతురి తల్లి.

"మరదలా," అని పిలుస్తూ ఆమె వెంటబడింది మరో ముత్తయిదువు.

"ఏమే, మా చెల్లెలి కొడుకు కిరీటి పనికివచ్చాడు కాదూ నీ చిన్నకూతురికీ?" అని కూడా అడిగిం దామె, కంఠం నొక్కుకుంటూ.

"అదేమిటి వదినా అలా అడుగుతావూ నువ్వూ? కిరీటివంటి పెళ్ళికొడుకుని సంపాదించుకోగలమా మేము? పిల్ల చూపంతా అతనిమీదే వుందమ్మా యిప్పటికీని?"

"మరి, యిలా యెందుకు జరుగుతోందీ?"

"మా పెద్దల్లుడు వుద్యోగస్థుడు, నువ్వెరుగుదువు. చిన్నల్లుడు కూడా వుద్యోగస్థుడే అయి వుండాలిట మీ తమ్ముడుగారికి. శతపోరాన్నేను, వినిపించుకుంటేనా?"

"నలభై యకరాల మాగాణి—ముద్దులుమూటకట్టే మేడ—యాభై అరవై వేలకు తక్కువలేని నిలవ—"

"మే మెరగమటమ్మా? ఘటన లేదనుకోవాలి."

"పెళ్ళికి రమ్మని పిలిచారు కామోసు మీరు, సభలో కూచుని వున్నాడు మా నాయన. వాడియెదట మీరు తెచ్చిన పెళ్ళికొడుకు—"

"తీసికట్టు, సరా?"

"రెండో పెళ్ళివాడని సందేహించినట్టున్నాడు, మా తమ్ముడు. పాతికేళ్లు నిండలేదు నాయనకు."

"అదేమీ కాదమ్మా, రెండో పిల్లనయినా యీ వూళ్లో యిచ్చుకుందామని మహావుబలాటపడ్డాన్నేను. పిల్లరాతా నారాతా యిలా వున్నా యేమి చెప్పకోనూ?"

"పద్ధెనిమిదేళ్ళు నిండిన పిల్లగదా, సంబరమే కనపడదేమే మొగానా? నే నెరగనివా దాని చురుకుదనమూ, దాని వుబలాటమూ—"

"పీటలమీదికి వెళ్ళాక యేమవుతుందో నా బిడ్డ, మతి పోతోందమ్మా నాకు."

"మెడలు వంచారు కామోసు మీరు, అదేం చెయ్యగలుగులే, పసిపిల్ల పాపం?"

"పిలవడానికి వెళ్ళగా 'నేను రాలేను వదినా, మరోలా? అనుకోకు' అంది మీ చెల్లెలు. కిరీటికి తండ్రి లేకపోడం నిజమే అనుకో, నే నర్థంచేసుకోలేదనుకున్నావా మీ చెల్లెలి వూహ?"

"తనకి కట్నం అక్కర్లేదన్నాడు కిరీటి. 'ఆ మహాలక్ష్మి తన యింట్లో అడుగుపెడుతుం' దనుకుంది నా చెల్లెలు."

"మూడువందల రూపాయల జీతగాడని పెళ్ళికొడుకుని చూసి మురిసిపోతున్నారు మీ తమ్ముడు, నిన్న తెల్లవారింది మొదలు అన్నం ముట్టం లేదు, నా బిడ్డ తెలుసా?"

"పదివేలు పోసి కొని తెచ్చుకున్న మొగుడు, కాఫీ వుపమాలూనే గాని అన్నం ముట్టుతుందా యేమిటది యింక?"

3

"ఏమి శేమి?" అని ఆత్రంగా అడుగుతూ వచ్చాడు గౌరీపూజామంటపం దగ్గిరనుంచి కన్యాదాత.

"కన్యావరులదగ్గిర ఆగిపోయివుందండీ తంతు" అని బదులు చెప్పాడు తన పురోహితు డతనికి.

"కారణం?"

"గ్రామస్థు లడిగిన మొత్తం వరపక్షంవా రివ్వరుట. వరపక్షం వారిచ్చేది గ్రామస్థులూ పుచ్చుకోరుట"

"ఇంత అని నిర్దేశం—"

"పదిరూపాయ లడిగారు గ్రామస్థులు. తమకు తోచిం దిస్తారుట వరపక్షంవారు. అదయినా గ్రామత్వేనా కాదుట, అణా చొప్పున యిస్తారుట."

అటుచూసి యిటుచూసి "బావగారూ" అని పిలిచాడు కన్యాదాత, పెళ్ళికొడుకు తండ్రిని.

"మీరు చెప్పతలిచిం దేదో నాతో చెప్పండి" అన్నాడు యాజు లవ్యవధానంగా, కళ్ళు పెద్దవి చేసుకునీ, తర్జనితో తనని నిర్దేశించుకుంటూను.

కన్యాదాత తన మామగారికేసి చూచి వూరుకున్నాడు.

ఆవూరి కరణమే అతని మామగారు.

అసలీసంబంధం కోరి కుదిర్చినవాడే ఆ కరణం.

అటూ యిటూ మాతామహు లయివున్నవా రిద్దరూ చూసుకున్నారు గంభీరంగా,

"నేను మీకు చెప్పవలసినవాణ్ణి కాను" అన్నాడీ మాతామహుడు.

"నేను మీచేత చెప్పించుకోవలసినవాణ్ణీ కాను" అన్నాడా మాతామహుడు.

"వ్యవధి లేదు మరి" అన్నాడు కన్యాదాత పురోహితుడు.

"మన కా ఆందోళన అక్కర్లేదు, మిథునం కూడా తారాబలచంద్రబలయుక్తంగానే వుంది" అని బదులుచెప్పాడంగుడు వరపక్షంవారి పురోహితుడు, యాజులందుకోకమునుపే.

"నా కనుష్ఠానసమయం అవుతోంది, మరి" అంటూనే లేచాడు సభాపతి.

"మిథునమే స్థిరపరిచారా?" అనడుగుతూ తానుగూడా లేవడాని కుద్యుక్తుడయినాడు, పొరుగూరి వృద్ధపండితుడు.

"ఆందోళన అక్కర్లే దన్నా నంతే" అని మళ్ళీ బదులు చెప్పాడు వరపక్షం పురోహితుడు.

"ఏమి సెలవు?" అనడిగాడు కన్యాదాత, చేతులు దోయిలించుకుని యాజులుని.

"చెప్పానుగా?"

అసంతృప్తి—విసుగు—నిరసనభావం - అసహనం—ముంగోపం—మూతివిరుపులు—ఇన్ని ప్రతిఫలించాయి, సభాముఖాన.

"మనం వైదీకులం, ఇది వైదికతంతుకి సంబంధించిన విషయం. మీరు కొంచెం ఆలోచించాలి" అంటూ వేడుకున్నాడు, గ్రామకరణం.

"ఎంత దూరం ఆలోచించాలో అంత దూరమూ ఆలోచించే స్థిరపరిచా న్నేనీ విషయం" అంటూ తివాసీ గుద్దాడు యాజులు.

4

ఉత్తరపువసారాలో పైడిస్వామి సన్నాయి ఆగిపోయింది.

దక్షిణపు తెరపిలో అమ్మాణ్ణి మేజువాణీ కూడా నిలిచిపోయింది.

"ఏమిటేమిటి?" టనకుగుతూ దూసుకువచ్చారు చాలామంది పెళ్ళిపెద్ద లుభయపక్షాలవారూ.

వారిలో వొక సబ్‌మాజిస్ట్రేటున్నాడు.

ఒక సర్కిల్ ఇనస్పెక్టరున్నాడు.

ఏడెనమండుగురు అడ్వకేట్లున్నారు.

అయిదారుగురు డాక్టర్లున్నారు.

పంచాయతీబోర్డు ప్రెసిడెంట్లే వున్నారు పదిమందికి పైగా.

ఒక బుగ్గమీసాల ముస్నద్దీ కూడా వున్నాడు.

"దయచెయ్యండి రాజుబాబూ" అంటూ వచ్చాడా ముస్నద్దీ, ఒకక్షత్రియ ప్రముఖుడికి తహాజీమిస్తూ.

ప్రశ్నలు—ఆందోళన—జిజ్ఞాస—ఆత్రం —అభావం—కంగారు — అసంతృప్తి—వెటకారం—ఇన్ని చిత్తవృత్తులు లాస్యం చేస్తున్నాయి వారందరి మొగాలమీదా.

వరుని వూరి పెద్దకరణం ఆ ముస్నద్దీ.

ఆవూరి మున్నబా క్షత్రియప్రముఖుడు.

కానయితే మూడో వరసలో కూచున్నాడు ముస్నద్దీ, కాని, కొంకుభట్లు, ముందటు మామగారిని చూసి, తరవాత తనకేసి చూసిన చూపందుకుని "ఏ స్థితిలోవున్నాం బ్రహ్మగారూ మనం?" అనడిగాడు పురోహితుణ్ణి, ముందు తానాసనశుద్ధిగా కూచుని.

పురోహితుడు చెప్పాడు.

"ఊరివారికీ మొగపెళ్ళివారి పక్షం పెద్దలకూ మాటపట్టింపులు వచ్చాయి కన్యావరణల దగ్గిర, మరి" అనిన్నీ వివరించాడతను.

"అలాగా?" అన్నట్టు తల పంకించుకున్నాడు ముందు ముస్నద్దీ.

"దుంపలు దంపలుచేసుకుని తరలివచ్చాక—మంగళస్నానాలయినాక — ధర్మప్రజాసంపత్తికోసం ఒక స్త్రీని పెళ్ళిచేసుకుంటానంటూ వరుడు సంకల్పం చేసుకున్నాక—పిల్లను చూసిపెట్టండని కోరి పెద్దలను రాయబారం పంపవలసిన స్థితిలో—వరుడు మూడుముళ్ళు వెయ్యగలిగేటట్టు సన్నివేశాలు కల్పించుకోవలసిన మొగపెళ్ళివారికి పట్టింపులు."

"చిత్తం" అన్నాడు పొరుగూరి విద్వాంసుడు.

"ఆడపెళ్ళివారితో నయినా కాదు, వూరివారితో పట్టింపులు."

"చిత్తం—చిత్తం"

సభ అంతా చలితం అయిందీయెత్తుగడ చూసి.

ఎగిసిపడి విరగబడి చూశాడు యాజులు.

అది గుర్తించాడు ముస్నద్దీ.

"సద్దుకోడం ధర్మం" అన్నాడతను, తాపీగా.

"తమరు చాలా ధర్మంగా సెలవిప్పించారు" అన్నాడు విద్వాంసుడు.

"మరి. తరవాయి?" అని మళ్ళీ అడిగాడు ముస్నద్దీ.

"ముందడుగు వెయ్యవలసినవా రెవరో తమరు వక్కాణించడం."

"మరి ముందడుగు వెయ్యడం అంటే?"

"వెనకతీత అన్నమాట."

"అదీ మాట. వెనకతీత వున్నచోటే సాచి అడుగు పడుతుంది ముందుకి"

"పోనీ అంటే వూరివిద్వాంసులు—"

"నాకు బాగా తెలుసు. ఈవూరి విద్వాంసులు పుంభావసరస్వతులు. ఇక సభాపతిగారా, సాక్షాత్తూ బృహస్పతే. కనుక వారు సెలవిప్పించినట్టు నడుచుకోవలసినవాణ్ణే కాని, వారికి చెప్పవలసినవాణ్ణి కాన్నేను."

"చి-త్తం" అన్నాడు మళ్ళీ పొరుగూరి విద్వాంసుడు సాగతీసుకుంటూ.

గతుక్కుమనిపోయాడు యాజులు.

తమపక్షంగా వచ్చిన పెద్దమనిషే తనమీద—ముఖ్యంగా తనమీద దోషారోపణ చెయ్యడం.

కొట్టినంత పనయింది యాజులుకి దీంతో.

పైగా, ముభావంగా మాట్లాడుతున్నాడు ముస్నద్దీ.

కనక?

"వారడిగినంతా? యివ్వవలసినదేనా?" అనడిగాడతను, తానూ ముభావంగానే.

"వారడిగినంతా యివ్వవలసిందేనా? అని కాదు, చూసుకోవలసిం దిక్కడ, వారిచేత అడిగించుకోవలసిందేనా?" అని.

"పండితులకు సంభావన యివ్వడం అంటే నాకెంత యిష్టమో—"

"కన్యావరణ లివ్వడం అంటే పండితులకు సంభావన యివ్వడం కాదు యాజులుబాబుగారూ" అన్నాడు పురోహితుడు.

"మరేమి టండీ కాకపోతే?"

చాలా గట్టిగా అడిగా డత నీమాట.

గదించి మరీ అడిగాడు.

"ఏమిటీ వుమ్మన్న?" అన్నట్టు చూశాడు ముస్నద్దీ, యాజులుకేసి వోరకంట.

"అయ్యా, యాజులుబాబుగారూ, మీ మనమడు పెళ్ళిచేసుకోబోతున్నా డిప్పుడు. అందు కో పిల్ల కావా లతనికి. మంచిపిల్లను చూసిపెట్టండని రాయబారాలు నడపగల సుహృదులను ఏరుకుని ప్రార్థించాడు వారిని. ఎక్కడి కెక్కడికో వెళ్ళమని అతని ప్రార్థన. దారిఖర్చులు కావాలి వెళ్ళాలంటే వారికి. మీ మనమడే యివ్వా లందు కొంత డబ్బు. నేను కన్యావరణ లిమ్మన్నా నే, అది, అలా యివ్వవలసిన డబ్బన్నమాట. అది సంభావన యెలా అవుతుందీ? డబ్బేమో మీ మనమడిదీ, మీ మనమడే యివ్వవలసిందీని. అది మీ చేతిలో వుంది మరి, యిప్పుడు. అంచేత నే మిమ్మ ల్నడగవలసివచ్చింది నాకు."

చిరునవ్వు కనపరుస్తూ చెప్పాడు పురోహితుడీ మాటలు.

వెటకారం వుందా చిరునవ్వులో నిగూఢంగా.

అది గమనించాడు ముస్నద్దీ.

అతని బుద్ధి చమత్కృతం అయింది దీంతో.

"అయితే, కొంత పొగడ్త పూతపెట్టాలి దానికి, తాను.

అయితే, యాజులుగారి కిది తెలియదనేనా బ్రహ్మగారూ, మీ వూహ?" అనడిగా డతను, సాకూతంగా చూస్తూ.

"వారికి తెలుసునా తెలియదా? ఇది కాదు పంతులుగారూ నేను చూసుకోవలసింది. వివాహం తంతుకి సంబంధించి యెవరికే జిజ్ఞాస కలిగినా - అగత్యం అని నాకే తోచినా, యిక్కడ యింతమంది సరసు లున్నారు కనక - నేను బ్రహ్మాసనం అధిష్ఠించిన్నీ వున్నాను కనకగూడా, అది వివరించడం నా విధీ, నా బాధ్యతానూ" అని బదులుచెప్పాడు పురోహితుడు.

"ఒక్క సంగతి మనవిచేసుకుంటాను సెలవయితే?" అంటూ అందుకున్నాడు పొరుగూరి విద్వాంసుడు మళ్ళీ.

"సెల విప్పించండి" అన్నాడు ముస్నద్దీ.

"సభాపతిగారు పది రూపాయ లిమ్మన్నా రంటే, అది, వారి సొంతానికి కాదు. వారు ఈవూరి బ్రాహ్మణ్యాని కంతకూ కిరీటంలేని రాజు. వారసత్వేనా మాత్రమే కారు వారు సభాపతులు, సర్వాత్మనా వారే అందుకు తగ్గవా రిప్పు డీవూళ్ళో. అశీతిద్వయమూ కత్తులమీద పరీక్ష యివ్వగలరు వా రివాళ కూడా. శ్రౌతమున్నూ అంతా వారికి వాచోవిధేయమూ, కొట్టిన పిండిన్నీ. చయనం చేసివున్న—సర్వతోముఖమున్నూ చెయ్యబోతున్న కర్మిష్ఠులు వారు. అగ్రహారీకుల్లో వొకరు. ఈవూరి పెద్ద స్థితిపరుల్లో కూడా వారొకరు."

"నమో మహద్భ్యః" అన్నాడు ముస్నద్దీ, సభక్తికంగా అంజలిబంధం శిరస్సున కీలించుకుని.

"గడపచీరల పద్ధతి ఎంతో సంప్రదాయపరిజ్ఞానం వున్న సంపన్నులుగాని గుర్తించలేరు. తమ రది ఆచరించే వున్నారు, కనక, మనవిచేసుకుంటున్నాను. తమ అయిదుగురు కుమాళ్ళ పెళ్ళిళ్ళలోనూ ఆచరించి వున్నవారు సభాపతిగారు."

"పరమ ప్రామాణికులు వారు" అంటూ మళ్ళీ అంజలిబంధం శిరస్సున కీలించుకున్నాడు ముస్నద్దీ.

'ఈవూరి బ్రాహ్మణ్యంలో వచ్చిన సభాకట్నం అంతా—కన్యావరణల మొత్తమున్నూ అంతా ఈవూరి నూటయాభైయిళ్ళ బ్రాహ్మణ్యానికీ పంపకం అవుతుంది సంవత్సరాని కొకమాటు."

"అవును, ఎక్కడా అంతే అది."

"ఇక్కడి విశేషం యేమిటంటే? మహాశివరాత్రి పర్వదినాన అదంతా పొరుగూరి విద్వాంసులకు వినియోగం అవుతుంది, యథోచితంగా."

"అదీ విన్నాను."

"అదిగో, అందుకోసం యీవూరి బ్రాహ్మల అంతస్థు కాపాడాలి సభాపతిగారు. తరలివచ్చినవారి దర్జా కాపాడాలి. అందరి క్షేమమూ కోరాలి."

"కనక?" అనడిగాడు యాజులు పురపుర చూస్తూనూ, తల యెగరవేసుకుంటూను.

"వారు చెప్పింది విశ్వసించడమూ, అంగీకరించడమూ ధర్మం యెవరికయినా."

"ధర్మం అంటే యెక్కడికి?"

"ఇందాకా అడిగేవున్నారు మీరీమాట. ధర్మం వొక విధంగా గహనమూ, మరో విధంగా విశదమున్నూ. దాని పరిధులు గుర్తించే శక్తి బాధ్యతా బుద్ధివి."

"పది రూపాయలని వారు పేరు పెట్టడం ధర్మంగా వుందా?"

"నిక్షేపంగా వుంది."

"అంతేనా మా తాహతు?"

తేరిచూశాడు పండితుడు.

ధార్త్యం అవలంబించా లనుకున్నాడు.

అతని పెదవు లదిరాయి.

అది గుర్తించి "ఆగండి" అన్నాడు ముస్సద్దీ పండితుణ్ణి, చెయ్యూపుతూ.

"యాజులు బాబుగారూ" అంటూ అటు చూస్తున్న వాడిటున్నూ తిరిగా డతను.

సభ అంతా నిస్తరంగసముద్రం అయిపోయింది, చూపంతా ముస్సద్దీమీద నిలిపి.

"మీరు పుచ్చుకున్న వరకట్నంలో, నూటికి పది రూపాయల చొప్పున వుంచుతారు మీరు మంగళ హారతి పళ్ళెంలో, సదస్యం సందర్భాన, తరవాత, తానున్నూ స్వయంగా హారతి యిస్తుంది మీరు తీసుకు వచ్చిన మేళనాయకురాలు. అందరు సానులవంటిది కాదు, నూటికి రెండు రూపాయలు పుచ్చుకుంటుం దామె, ఖరారుగా. బ్రహ్మణ్యులయిన పూరిపండితులు వెయ్యికి రూపాయి అడిగారు మిమ్మల్ని."

"అంతేనా మా తాహతు? అనుకుంటున్నా న్నేను, మళ్ళీ."

"అది కాదని చూపించండి మీరు ముందు. అడిగే వాడు తక్కువ అడగాలి. ఇచ్చేవాడెక్కువ యివ్వాలి. ఇది వైదికధర్మం. మన వేదశాస్త్రా లవగాహన చేసు కున్న వారి చిత్తవృత్తి యిలా నడుస్తుంది."

ఇరుకున పడ్డాడు యాజులు.

దారి కనపడలే దతనికి.

మాటయినా తోచలేదు.

అందరూ మెచ్చుగా చూశారు ముస్సద్దీకేసి.

"సెబాస్" అన్నట్టు అతని వీపే నిమిరాడు రాజు బాబు.

పెళ్ళికొడుకూ కొండుభట్టూ మొగమొగాలు చూసుకున్నారు.

"ఇచ్చెయ్యండి మామగారూ" అన్నాడు కొండు భట్టు, అవ్యవధానంగా.

ముస్సద్దీ మాటలు బాగా కెళ్ళించా యతణ్ణి మరి.

యాజులు మాత్రం ఉగ్రు డయినాడు.

"నా కొడుకు పెళ్ళికాదు, నీకొడుకు పెళ్ళిది. ఇవ్వడానికయినా మానడానికయినా నీదీ అధికారం" అంటూ రొక్కం సంచీ కొండుభట్టుదగ్గిర వుంచేశా డతను.

5

"వందే-మాతరమ్" అంటూ వొక వాగ్బాణం రివ్వు మంది సమయాన పెళ్లి పందిట్లో.

ఉత్తరపు వసారాలో పది ప్రతిధ్వను లిచ్చిం దారివ్వ.

ఆ పదిరివ్వలూ పదుగురు ఐచ్ఛికసేవకురాళ్లయి ప్రవేశించాయి పెళ్లి పందిట్లో పసుపుపచ్చని జెండాలతో.

వారివెనక దళపతి వాలకంలో వొక యువతి.

సభ అంతా నిర్విణ్ణం అయిపోయిం దామెని చూసి.

"సిస్టర్ జానకీదేవి" అంటూ యువకుల్లోనూ, 'జానకమ్మక్క' అంటూ యువతుల్లోనూ కోలాహలం రేగింది.

"దీక్షితులు బాబయ్యా" అంటూ పిల్చిందామె గంభీరంగా చూస్తూ, సౌమ్యంగానే.

చూసి వూరుకున్నాడు కన్యాదాత.

ఊరుకున్నాడంటే, మాట రాక.

మాటరాక అంటే, గుండె లాగిపోయి.

పెళ్ళికొడుకు ఎడమక న్నదిరింది.

ఎందుకో ఆందోళన — ఎందుకో నిరాశ — ఎందుకో భయం — ఎందుకో కంగారు — ఇన్ని కమ్ముకున్నా యాతని మొగాన, దట్టంగా.

"దీక్షితులు బాబయ్యా" అంటూ మళ్ళీ పిలిచిం దామె, ఆలస్యం సహించలేక.

యాజులు కంఠం బిగుసుకుపోయింది.

"ఏమి తల్లీ?" అనడిగాడు దీక్షితులు, బాగా ఎత్తుపడిపోయి.

"ఎంత కొక్కన్నావయ్యా, నువ్వీ పెళ్ళికొడుకుని?" అనడిగిం దామె, గొంతెత్తి.

సభ అంతా దద్దరిల్లిపోయిం దీమాటతో, బాంబు పాటు లాగ.

"ఎంత కొక్కన్నావంటే—" అంటూ అందుకున్నాడు కరణం.

నిప్పులు కక్కుతూ చూసింది సిస్టర్ జానకి కరణంకేసి.

"దీక్షితులు బాబయ్యా తప్ప మరెవరూ బదులు చెప్పనక్కర్లేదు నాకు" అంటూ వురిమిం దామె.

"నేను తీవ్రంగా గర్హిస్తున్నా నీమాట. చాలా అవమానకరమైన ప్రశ్న మాకిది." అన్నాడు యాజు లుద్రిక్తుడై.

ఇటు చూస్తే కొండుభట్టు తలవంచుకుని వున్నాడు.

అటు చూస్తే తన కూతురు ఆత్రపడిపోతోంది, తనకేసీ కొండుభట్టుకేసీ చూస్తూ.

అంచేత వూరుకోలేకపోయాడు, యాజులు.

"మీ రెవరండీ?" అనడిగింది సిస్టర్ జానకి అతణ్ణి.

"పెళ్ళికొడుకు నా మనమడు.

"ఎలాంటి మనమడు?"

"కూతురి కొడుకు."

"మీ ప్రమేయం లేదిక్కడ, మీరూరుకోండి."

కొండుభట్లు ఒకమాటు తలయెత్తి చూసి మళ్ళీ మొగం వంచుకున్నాడు.

ఆమాటతో అతని కొక ప్రాణం లేచివచ్చినట్టయింది.

"నీ ప్రమేయం మాత్రం యేమిటం దిక్కడ?" అనడిగింది పెళ్ళికొడుకు తల్లి, రుసరుసలాడుతూ.

తన భర్త అడగవలసిన ప్రశ్న అది.

అడగనందుకు చాలా కోపంగా చూసింది కూడా అతనికేసి.

"కొంచెం వోపికపట్టు" అంది సిస్టర్ జానకి, చేత్తో నిషేధిస్తూ ఆమెని.

"అసలు నిన్నెవరు పిలిచారంట, యిక్కడికి?" గద్దిస్తూ మళ్ళీ అడిగింది పెళ్ళికొడుకు తల్లి.

"మా దీక్షితులు బాబయ్య సంగతి తేలనీ. తరవాత అడుగు, నీ యిష్టం వచ్చిన ప్రశ్నలు నన్ను."

"ఎవరి సంగతి అయినా నీ కెందుకనడుగుతున్నాన్నేను."

"నీకొడుకు మూడుముళ్ళూ వెయ్యగలిగేదాకా అభ్యాగతురాలవు నువ్వసలు. నీ హద్దులో నువ్వుండు."

ఏమనడానికీ తోచలేదు పెళ్ళికొడుకు తల్లికి.

అలవాటయివున్న అధికారం మాత్రం వుబికింది.

"ఊరుకుంటారేమండీ?" అంటూ కస్సుమందామె వెంటనే, భర్తమీద.

అందరి చూపులూ కొండుభట్లుమీద పడ్డాయి.

"విద్యాపురా లెవరా?" అని నిరీక్షిస్తున్నవారికందరికీ సందేహం తీరిపోయింది.

కొండుభట్లుకి మరో ప్రాణం లేచివచ్చినట్టయింది.

అర్ధనారీశ్వరుడిప్పుడతను.

పెళ్ళికొడుకు మొగం చిట్లించుకున్నాడిదంతా చూసి.

గౌరీపూజా మంటపం దగ్గిరనుంచి వచ్చి, తన పక్షం స్త్రీల నందరినీ తప్పించుకుని ముందువరసలో నుంచుంది పెళ్ళికూతురి తల్లి.

ఆమెని గుర్తించింది జానకి.

"ఏం బాబయ్యా, బదులు చెప్పాలి నాకు" అంటూ నిక్కచ్చిచేసింది కూడా కన్యాదాతనామె.

"కొనలేదు నేను. వరదక్షిణ యివ్వడాని కంగీకరించాను. ముందే యిచ్చేశాను కూడా."

"వరదక్షిణ అంటే యేమిటండీ?" అనడిగింది సిస్టర్ జానకి, పురోహితుణ్ణి.

"తాను చేసిన కన్యాదానానికి సాద్గుణ్యం లభించడానికి కన్యాదాత వరుడి కిచ్చే హిరణ్యం" అని బదులుచెప్పాడు కన్యాదాత పురోహితుడందుకు.

"ఎప్పుడివ్వాలది?"

"కన్యాదానం చేశాక."

"అది పూర్తయిందా?"

"అంతవరకూ రానేలేదింకా. పిల్లను చూసిపెట్టమని వచ్చిడు రాయబారులను కోరనేలేదు కూడా యింకా."

"ఏం బాబయ్యా, నువ్విచ్చింది వరదక్షిణ కాదు. తమ కొడుకుని నీ కమ్మినందుకు కొండుభట్లుగారికి క్రయధనం నువ్విచ్చింది."

"....................."

"వరకట్నం అని వొప్పుకో నువ్విచ్చింది."

"వరకట్నం అనడమూ వుంది, లోకంలో, దాన్ని."

"ఏమండీ బ్రహ్మగారూ, ఏం చెబుతారు మీరు?"

"వరకట్నం వేరూ, వరదక్షిణ వేరూను. రెండూ జరుగుతున్నా యీ రోజుల్లో"

"నువ్వు చేసింది 'లా' కు విరుద్ధం. తెలుసా బాబయ్యా?"

"....................."

"నువ్వు చేసింది శిక్షార్హమైన నేరం. ఇదిన్నీ గుర్తుకి వచ్చిందా?"

గభీమని లేచాడు యాజులు.

"మళ్ళీ గర్జిస్తున్నావ్ నీధోరణి" అంటూ వురిమాడతను, కోపావేశంతో వొణికిపోతూ.

"ఈ ధోరణి అర్థం అయిందా అసలు నీకు?"

"నీమాట కర్థం వుంటేనా?"

"అర్థవత్తుగా అడుగుతాను చూసుకో, ఏమాత్రం ధర కిట్టింది నీకు నీ మనమణ్ణి అమ్మకంలో?"

"నీ కెవ రిచ్చారీ అధికారం, యిలా అడగడానికి?"

"నీతికి సంబంధించిన అధికారం మన్నిస్తావా నువ్వు, లాకు సంబంధించిన అధికారం మన్నిస్తావా?"

"రెండూ మన్నించన్నేను."

"అయితే వోపికపట్టు. నిన్నూ నీ కూతుర్నీ, నీ అల్లుణ్ణీ, నీ మనమణ్ణీ కూడా విచారణ చెయ్యడానికి 'లా అండు ఆర్డరు' నీతి పాలించేవారు వస్తారు?"

సభలో వున్న సర్కిల్ ఇనస్పెక్టరు వొళ్ళు ఝల్లుమంది.

అతనూ సబ్ మాజస్ట్రేటూ మొగమొగాలు చూసుకున్నారు, ఆత్రంగా.

"అసలు, నువ్వెవరివి?" అంటూ గద్దించాడు యాజులు.

"గౌరీపూజా మంటపంలో వున్న పెళ్ళికూతుర్నిలా తీసుకురావే సూరీడూ" అంది, సిస్టర్ జానకి, అటు చూసి, పురిమినట్టు.

లోపలికి జయలుదేరింది, కలంటియరు సూరీడు, పసుపుపచ్చ జెండా వూపుకుంటూ.

పెళ్ళికూతుర్ని వెంటబెట్టుకునిన్నీ వచ్చింది, ఉత్తరక్షణాన.

అందరూ తుళ్ళిపడ్డారది చూసి.

పెళ్ళికొడుకు కొయ్యయిపోయాడు.

"అదిగో చూడు, ఆ బాలికకు ప్రతినిధురాలిన్నేను, ఇప్పుడు చెప్పు నాకు బదులు. ఎంత కమ్మాన్నవు నీ మనమణ్ణి?" అంటూ నిలవతీసింది యాజుల్ని, సిస్టర్ జానకి.

అటు తిరిగింది తరవాత.

"నీయిష్టంమీదే కొన్నాడా మీనాయన, యీ పిల్లాణ్ణి, సుభద్రా?" అ నడిగింది పెళ్ళికూతుర్ని.

"మొగుణ్ణి కొనుక్కోడం నాకిష్టం లేదు"

"పోనీ, కొని తేవడం జరిగిపోయింది గదా ఈ ఈ పిల్లాణ్ణి పెళ్ళాడ్డం నీ కిష్టమేనా మనస్ఫూర్తిగా?"

"కాదు."

ఉబ్బెత్తుగా లేచినుంచున్నాడు పెళ్ళికొడుకు. పీట దిగి అడుగున్నా వెయ్యబోయాడతను.

"ఆగు!" అంటూ గద్దించింది, సిసర్ జానకి.

పెళ్లికొడుకు మానుపడిపోయాడు.

అది చూసి కొండుభట్లు లేచాడు.

"రారా, అబ్బాయీ. మనం వెళ్ళిపోదాం" అంటూ దారిచేసుకోడానికిన్నీ చూశాడతను.

"నుంచో!" అంటూ కస్సుమంది అతనిమీద కూడా సిసర్ జానకి.

"నీకొడుకు నమ్ముకున్నావే మా దీక్షితులు బాబయ్యదగ్గిర పదివేల క్రయధనం పుచ్చుకొని? గోడవల్లో దిగడం భయం అయితే ఆ డబ్బంతా ముందిక్కడపెట్టి మరీ కదులు."

ఇలా అంటూనే సభకేసి తిరిగిందామె.

"అయ్యా, అమలాపురం సర్కిల్ ఇనస్పెక్టరుగారూ, సబ్ మాజిస్ట్రేటుగరూ, బహుశ్రుతులు ఓ అడ్వకేట్లూ, డాక్టర్లూను, దర్భముళ్ళ మున్నబు కరణాలు కూడా వినాలి. సంగతి అంతా తెలిసే వచ్చారు మీరందరూ యిక్కడికి. వచ్చి జరిగిందీ, జరుగుతున్నదీ చూశారు, చూస్తున్నారు కూడా. మీ అందరి పేర్లూ నోటుచేసుకుని వున్నాన్నేను. సిద్ధంగా వుండండి, కోర్టుకు రావలసివుంటుంది మీరందరూ" అనిన్నీ అందామె, గొంతెత్తి.

6

ఆంధ్రపత్రిక, మెయి 22:—

చండికేశ్వరం అగ్రహారం, మెయి 19 :- తూర్పు గోదావరిజిల్లా, రామచంద్రపురం తాలూకా, చండికేశ్వరం అగ్రహారంలో, మొన్నటి 15వ తేదీ నొక వివాహం జరిగింది. వధువు, పీసపాటి వేంకట దీక్షితులు గారి రెండో కూతురు సుభద్ర. వయస్సు 18 ఏళ్ళు. వరుడు ఆ అగ్రహారం కాపురస్థుడే అయిన దగ్ధ వీరేశ్వర తర్కవాచస్పతిగారి ఏకైకపుత్రుడు కిరీటిరావు. వయస్సు ఇరవైనాలుగేళ్ళు, కాని, రెండో పెళ్లివాడు. నలభైయకరాల మాగాణిభూస్వామి. మంచి ప్రతిభావంతుడు. సుభద్ర చక్కని చుక్క అయితే అతను స్ఫురద్రూపి, దర్జాఅయినవాడు త్యాగి, భోగి, తాలూకా కంతకూ గ్రంథాలయోద్యమంలో ప్రముఖుడు.

కాని పెద్దచదువులు చదివినవాడు కాడతను. తను పెద్దల్లుడు లాగే తన చిన్నల్లుడున్నూ సర్కారు ఉద్యోగి అయివుండాలన్న అభిలాష కలవారు కావడంవల్లనే వేంకట దీక్షితులుగారతనికి తమ కొమార్తెనివ్వడాని కిష్టపడలేకపోయారు.

అయితే, మొదటిభార్య పోయినప్పణ్ణుంచీ కిరీటిరావు మాపంతా సుభద్రమీదే వుందిట. సుభద్రకూడా అతణ్ణే గాఢంగా ప్రేమించివుందిట. దీనికి సాయం, కల్లూరివారి సంబంధం తప్పిపోయాక అప్పటి కప్పుడు సుభద్రకు వివాహం చెయ్యవలసివచ్చింది వేంకట దీక్షితులుగారికి. లేకపోతే చేసిన ప్రయత్నం అంతా వ్యర్థం అయిపోయే పరిస్థితి యేర్పడింది. చాలా వేలు ఖర్చయిందట అందుకోసం. ఆ కారణంవల్లా, యథార్థం గ్రహించీ వేంకట దీక్షితులుగారు సుభద్రను కిరీటిరావు కిచ్చి, తెల్లవారక మిథునలగ్నంలోనే వివాహం జరిగించారు. ఉభయఖర్చులూ తామే భరించి దేవదుందుభులు మోగేటట్టు మహోత్సవం జరిగించారు.

చివరి కిలాగ ఆ ప్రేమికు లిద్దరూ దంపతు లయినందుకు చూసినవారూ, విన్నవారూ చాలా సంతోషిస్తున్నారు.

కిరీటిరావున్నూ తాను కోరిన వధువు తనకు లభించినందున పరమానందభరితుడై, ఊరిగ్రంథాలయానికి స్వయంగా వొక భవనం కట్టించి యివ్వడానికి పూనుకున్నాడు.

ఈవివాహం ఈవిధంగా జరగడానికి సిస్టరు జానకీదేవి పూనికే ముఖ్యకారణం. మొదట ఆమె సాహసం గుర్తించలేనివారు ఇప్పుడామెను వేయినోళ్ల ప్రశంసిస్తున్నారు.